

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

నా మైధన్ చాహూ, నా రతన్ చాహూ

తేరె చరణోం కి ధూల్ మిల్ జాయె తో మై తర్ జావూన్

శ్యాం తర్ జావూ, రాం తర్ జాహూ

'కాలాబజార్' సినిమాలో అతి కీలకమైన సన్నివేశంలో వస్తుంది భజన. మన సినిమాలలో పాటలు ఒక వరంలాంటివి. వాటిని సృజనాత్మకంగా, నిర్మాణాత్మకంగా వాడుకుంటే అవి సినిమా వ్యాపార విలువను పెంచటమే కాదు, నిత్యజీవితంలో ప్రతిక్షణం మార్గదర్శనం చేయగల శక్తిమంతంగా ఎదుగుతాయి. ముఖ్యంగా, గేయ రచయితలు సినీ సందర్భ పరిధిలో ఒదుగుతూ సార్వజనీన సత్యాలను సుందరంగా ప్రదర్శించినప్పుడు అవి సినిమా పాటల స్థాయిని దాటి వ్యక్తిత్వ వికాస గీతాల స్థాయికి ఎదుగుతాయి. అలాంటి పాటలను రచించటంలో శైలేంద్ర సుప్రసిద్ధుడు. కాలాబజార్ సినిమా దర్శకుడు విజయానంద్. పాటలని సినిమాలో అంతర్భాగం చేసి అత్యంత అర్థవంతంగా, ఆకర్షణీయంగా చిత్రీకరించటంలో పేరొందినవాడు. 'పాట' శక్తి తెలిసిన అతి కొద్దిమంది దర్శకులలో విజయానంద్ ఒకడు. విజయానంద్ పాటల చిత్రీకరణ కానీ, పాటను సినిమాలో అంతర్భాగం చేసే సందర్భాలను సృజించటంలో కానీ అగ్రశ్రేణిలో ఉంటాడు. విజయానంద్ కు ఎస్.డీ బర్మన్ అతి ఇష్టమైన సంగీత దర్శకుడు. వీరి కలయికలో రూపొందిన పరమాద్భుతమైన గీతం 'నా మై ధన్ చాహూ'

శైలేంద్ర నాస్తికుడు కాదు. కానీ, దైవాన్ని నమ్మడు. సినిమాలో సందర్భం ప్రకారం భజనగీతం రాయాలి. ఈ భజన గీతం ఎలాంటిదంటే, భజనే అయినా కథానాయకుడి మానసిక సంఘర్షణను ప్రతిబింబించాలి. 'కాలాబజార్'లో నాయకుడు 'బ్లాక్'లో టిక్కెట్లు అమ్మే వ్యక్తి. అలా డబ్బులు సంపాదిస్తాడు. కానీ మనసులో ఎక్కడో తాను తప్పు చేస్తున్నానన్న భావన ఉంటుంది. అతను చూసి ఆకర్షితుడయిన అమ్మాయికూడా 'బ్లాక్ మార్కెటీర్' అని చిన్న చూపు చూస్తుంది. 'బ్లాక్'లో టికెట్లు కొనేందుకు ఇష్టపడదు. అయినా డబ్బు ఆశ అతడిని 'బ్లాక్ మార్కెట్' వైపు ఆకర్షిస్తుంది. సినిమా ఆరంభంలో డబ్బు గురించి 'తేరీ ధూం హర్ కహీ' అంటూ ఓ పాట కూడా పాడతాడు హీరో. బ్లాక్‌లో టిక్కెట్లు అమ్మగా వచ్చిన డబ్బులతో ఇంట్లో ఉన్న తల్లికి, చెల్లికి బట్టలు, నగలు కొని ఇంటికి వస్తాడు హీరో. ఇంట్లోకి అతడు అడుగుపెట్టే సమయానికి అతడి తల్లి, చెల్లి కృష్ణ విగ్రహం ముందు భజన చేస్తూంటారు.

'నాకు ధనం వద్దు, రత్నాలు వద్దు, నీ చరణ ధూళి లభిస్తే చాలు నా జన్మ తరించిపోతుంది. కృష్ణా, రామా.. నా జన్మ తరించిపోతుంది' ఇదీ వాళ్ళు పాడే భజన. అతడు ఇంట్లో అడుగు పెడతాడు. పాట ఆరంభమవుతుంది. లభించిన డబ్బు మోహంలో పడి గర్విస్తూన్న హీరోకు ఈ పాట శరాఘాతంలా తాకుతుంది. మాములుగా వింటే చక్కటి భక్తి భావనను ప్రదర్శించినట్టు అనిపిస్తుంది. సినిమాలో చూస్తే, నాయకుడికి హెచ్చరికలా, అతడి మనసులో మథనం ఆరంభానికి నాందీ ప్రస్తావనలా తోస్తుంది. అంటే గేయ రచయిత ఎంత గడసరిగా రెండు అర్థాలు వచ్చేట్టు రాశాడో, దర్శకుడు దృశ్యం ద్వారా దాని అర్థాన్ని ఉద్దీపితం చేయటం మాత్రమే కాదు మరింత లోతైన అర్థానిస్తూ భజన పాటను నాయకుడి మానసిక సంఘర్షణను ప్రదర్శించే పరమాద్భుతమైన పాటగా రూపొందించాడు. నాయకుడు 'బ్లాక్'లో

టిక్కెట్లమ్మేది, డబ్బులు సంపాదించేది నగలు, బట్టలూ కొనేది తన తల్లి, చెల్లికోసం. కానీ వాళ్లు 'మాకు డబ్బు వద్దు, నగలు వద్దు' అంటున్నారు. అందుకే పాట వినగానే నాయకుడి అడుగు తడబడుతుంది. చేతిలోని వస్తువులు జారిపడతాయి.

**మోహమన్ మోహె లోభ్ లల్ చాయె**

**కైసె కైసె య్ నాగ్ లెహరాయె**

**ఇస్సె పహ్లేకి దిల్ ఉధర్ జాయె**

**మై తొ మర్ జావు, హాన్ మై మర్ జావు.**

'మోహ', మన్ 'మోహె'... అతి చక్కని పద ప్రయోగం. మోహం అతడి మనసును ఊరిస్తోంది. ఆకర్షిస్తోంది. అత్యంత ఆకర్షణీయమైన నాగులున్నాయి. సరిగ్గా ఈ సమయానికి ఓ గొలుసు వ్రేలాడుతూ కనిపిస్తుంది. 'ఎలాంటి ఎలాంటి విషసర్పాలున్నాయో?' అద్భుతమైన రచనకు అంత అద్భుతమైన దృశ్య భాష్యం. ఇవన్నీ 'మోహ'లు మనసుని ఆకర్షిస్తున్నాయి. లోభపెడుతున్నాయి. ఆ లోభం నుంచి తప్పించుకోవాలి. హీరో ఆ లోభంలో పడుతున్నాడు. ఇలాగ అతని తల్లి, చెల్లి పాడుతున్న భజన ఆ లోభాన్ని ఎత్తి చూపిస్తున్నది. దానివల్ల కలిగే అనర్థాన్ని చెప్పకనే చెప్తున్నది. పైగా తమ హృదయం ఆ ఆకర్షణీయమైన వాటివైపు వెళ్లేలోగా మరణిస్తే బాగుండు 'ఇస్ సె పహలేకి దిల్ ఉధర్ జాయె, మైతొ మర్ జావూ' అంటున్నారు. అంటే వాటి ప్రలోభాలలో పడటం కన్నా మరణం ఉత్తమం అంటున్నారు. ఎంతో గొప్ప భావం. ఇక్కడ అవే మాటలు శూలాలై నాయకుడి హృదయాన్ని తొలుస్తున్నాయి. అతడిలోని మలినాన్ని ఎత్తిచూపిస్తున్నాయి. ఇక్కడ దర్శకుడి ప్రతిభను ప్రదర్శించే ఓ విషయాన్ని గమనించాలి.

నాయకుడి తల్లి, చెల్లి 'మంచి'గురించి పాడుతున్నారు. మంచి వెలుతురు. అందుకే వారు వెలుతురులో ఉన్నారు. నాయకుడు చెడు దారిలో ఉన్నాడు. ప్రలోభాలలో పడుతున్నాడు. చెడు చీకటి. అందుకే నాయకుడు కనిపించినపుడల్లా చుట్టూ చీకటి ఉంటుంది. సినిమా అనేది దృశ్య మాధ్యమం. దృశ్యం చూస్తే విషయం అర్థం కావాలి. అంటే సంభాషణల అవసరం వీలయినంత తక్కువగా ఉండాలన్నమాట. ఏదైతే దృశ్యంద్వారా చూపించలేదో, దానికి 'మాటలు' అవసరం. 'పాట' లేకుండా దృశ్యం చూసినా మనసు నాయకుడి సంఘర్షణ బోధపడుతుంది. 'పాట' ఆ సంఘర్షణ స్వరూపాన్ని స్పష్టం చేస్తుంది.

**లాయె క్యా థె జొ లేకె జానా హై**

**నేక్ దిల్ హీ తేర ఖజానా హై**

**షాం హోతే హీ పంచి ఆ జాయె**

**అబ్‌తో ఘర్ జావూ, అప్నె ఘర్ జావూ..**

అద్భుతం! సరిగ్గా నేపథ్యంలో వస్తువులన్నీ పట్టుకున్న హీరో ఉంటాడు. అస్పష్టంగా. తెరముందు భగవంతుడి విగ్రహం, దానిముందు అతడి తల్లీ, చెల్లీ, ఇతరులు.

తీసుకు వచ్చిందేమిటని, వెంట తీసుకు వెళ్తాం? వెంట తీసుకు వెళ్లేది స్వచ్ఛమూ, నిజాయితీ అయిన హృదయం మాత్రమే. ఎందుకంటే ఎలాగయితే సాయంత్రం అవగానే పక్షి గూటికి చేరుకుంటుందో, అలా, మనిషి కూడా తన ఇంటికి చేరుకోవాలి. ఇంటికి చేరుకోవటం అంటే భగవంతుడిని చేరటం, అతడికి జవాబివ్వటం. అక్కడ స్వచ్ఛమూ, నిజాయితీ అయిన హృదయం తప్ప మరొకటి పనిచేయదు. ఎంతో మార్మికంగా గొప్ప సత్యం అతి సులభమైన పదాలలో ప్రదర్శించాడు శైలేంద్ర. ఇది సరిగ్గా నాయకుడి మనస్సుకు తాకుతాయి. అలజడి సృష్టిస్తాయి.

ఢం గయా పాని జం గయా కాయి

బహతి నదియాహి సాఫ్ కహలాయి

మేరె దిల్ నే హి జాల్ ఫైలాయె

అబ్ కిధర్ జావు, మై కిధర్ జావు.

ప్రవహించే నీరు స్వచ్ఛమైనది. ఎలాంటి మలినాలుండవు. ప్రవహించకుండా ఉన్న నీరు మలిన భూయిష్టము. దానిలో మురికి మాత్రమే కాదు పలురకాల హానికారకమైన జీవులు కూడా ఉత్పన్నమవుతాయి. కాబట్టి మనిషి దేనికీ మోహం చెందక, దేనితోనూ తీవ్రమైన అనుబంధం పెంచుకోకుండా ఉండాలి. ముందుకు సాగిపోతూనే ఉండాలి ప్రవహించే నదిలా. కానీ అతడి చుట్టూ అందమైన వల అతడి మనస్సే అల్లుతుంది. నేను, నావాళ్లు, నా ఇల్లు, నా ప్రాంతం ఇలా పలురకాల అందమైన వలలు అల్లుతుంది. ఎవరయితే మనిషిని రక్షించారో, వారే అందమైన వలలు అల్లి ప్రలోభ పెట్టి మోహమనే నాగులపాలు చేస్తూంటే ఇక మనిషి ఎటు పోవాలి? 'అబ్ కిధర్ జావూ, మై కిధర్ జావూ ' అని చివరలో వాళ్లు పాడుతూంటే, అది నాయకుడి మనస్సులో తుఫానులు రేపుతుంది. అక్కడినుంచి వెళ్లిపోతాడు. కానీ అతడి మనస్సులో తాను మాయాజాలంలో ఇరుక్కుపోతున్నాడని, తప్పుదారిలో వెళ్తున్నాడన్న ఆలోచన బీజం నాటటం జరిగింది. అది మహావృక్షమై చివరికి అతడు బ్లాక్‌లో టికెట్లమ్మటం మానేసి సరైన దారిలో పడతాడు. ఈ పాటను ఇంకెవరు రాసినా మరో రకంగా రాసేవారు. కానీ శైలేంద్ర గొప్పతనం ఏమిటంటే అతను సినిమాను క్షుణ్ణంగా అర్ధం చేసుకుని దాని సారాన్ని, పొందుపరుస్తాడు. జరగబోయే దాన్ని సూచిస్తాడు. అందుకే స్క్రిప్టు రచయిత సన్నివేశాలను ఒకదాని తరువాత  ఒకటి గొలుసులా ఎలా సృజిస్తాడో, దర్శకుడు చిత్రీకరణ ద్వారా ఎలా ఆ సన్నివేశాలను సజీవం, అర్ధవంతం చేస్తాడో, అలా శైలేంద్ర వారికేమీ తీసుపోకుండా తన గేయరచన ద్వారా సినిమాకు ఊపునిస్తాడు. సమాజంలో భావాలు ప్రచారం చేస్తూ మార్గదర్శకం చేసి చిరంజీవుల్లా నిలిచే గీతాలు సృజిస్తాడు.

'నా మై ధన్ చాహు' పాటకు ఎస్డీ బర్మన్ అత్యంత ఔచిత్యమైన బాణీని సృజించాడు. హంసధ్వని రాగం ఛాయలో ఉంచుతూ పాటకు ఒక శక్తిని ప్రసాదించాడు. వాయిద్యాల వాడకం కూడా వీలయినంత తక్కువగా వాడుతూ భక్తిభావస్ఫోరకమైన  వాయిద్యాలనే ఎన్నుకున్నాడు. నిజానికి ఆ సమయంలో ఎస్డీ బర్మన్ సహాయ సంగీత దర్శకుడిగా ఉన్న జయదేవ్ ఈ బాణీని రుపొందించాడంటారు. భవిష్యత్తులో జయదేవ్ 'అల్లా తేరో నాం' వంటి అతి చక్కని భజనలను రూపొందించాడు. ఎస్డీ బర్మన్ భజనలను సృజించలేదు. దాంతో జయదేవ్ ఈ పాటను స్వరపరిచాడన్న వాదనకు బలం చేకూరుతుంది. కానీ సినీ ప్రపంచంలో సహాయ సంగీత దర్శకుడి సృజనపై సంగీత దర్శకుడికి సర్వహక్కులుంటాయి. కాబట్టి ఇది ఎస్డీ బర్మన్ సృజనగానే భావించాలి. మొత్తానికి అత్యంత సృజనాత్మకమైన కళాకారులు కలసి అత్యద్భుతమైన గీతాన్ని సృజించారు. సమస్త సమాజానికి మనసు చేసే మాయను, ఆకర్షణలకు లొంగితే కలిగే అనర్ధాలను అతి సరళమైన పదాలతో, అతి సులువుగా భావం బోధపడే రీతిలో బోధించారు. అలాగని వ్యాపార విలువలతో రాజీపడలేదు. సినిమా గమనంతో రాజీ పడలేదు. కథానాయకుడి అంతరంగ సంఘర్షణ తీవ్రతను అత్యంత సృజనాత్మకంగా, అత్యద్భుతమైన రీతిలో మనసుకు హత్తుకునే రీతిలో ప్రదర్శించారు. అందుకే ఆ కాలంలో సినిమాలు కేవలం సినిమాలుగా మిగలలేదు. కళాకారులు కళాకారులుగా మాత్రమే ప్రజల మనస్సులలో నిలవలేదు. గాయనీగాయకులు, నటీనటులు ప్రజల నిత్యజీవితంలో విడదీయరాని సంబంధం ఏర్పరచుకున్నారు. పాటలు ప్రతి ఒక్కరికీ నిత్య జీవితంలో విడదీయరాని భాగం అయిపోయాయి. ఈనాటికీ సజీవంగా ఉండి  అలరిస్తున్నాయి. ఆలోచింపచేస్తున్నాయి.

ఈ సందర్భంలో ఇతర గేయ రచయితలు రాసిన భక్తిగీతాలు, భజనలు శైలేంద్ర, సాహిర్‌లు రాసిన భజనలు, భక్తి తాత్విక గీతాలతో పోలిస్తే ఒక విషయం స్పష్టం అవుతుంది. భావం అదే అయినా చెప్పే విధానంలో, పదాల వాడకంలో, సందర్భ పరిధిలో ఒదుగుతూ కూడా సార్వజనీన భావాలను ప్రదర్శిస్తూ సూటిగా శ్రోత హృదయ లోతుల్లోను చేరటంలో శైలేంద్ర, సాహిర్‌లు అగ్రస్థానం వహిస్తారు. అలాగని, ఇతర

గేయ రచయితలు వీరిముందు తేలిపోతారని కాదు, కానీ వీరి రచనలలో పదాలకు ఉన్న శక్తి పాటల ప్రభావాన్ని మరింత పెంచుతుందనిపిస్తుంది.

అయితే సినీ భజన మామూలు సినిమా స్థాయిని దాటి నిజ జీవితంలో వాగ్గేయకారుల గీతాల సరసన సగర్వంగా నిలచి, స్కూళ్లల్లోనూ ప్రార్ధనా గీతంలా ఎదిగే రచన మాత్రం సాహిర్‌ది, శైలేంద్రది కాదు. ఆ ఖ్యాతి అత్యంత సృజనాత్మకమయిన గేయ రచయిత భరత్ వ్యాస్‌కు చెందుతుంది.

(మళ్లీ వచ్చే నెల )

Post your comments